ప్రజల హృదయాల్లో నిలిచిన జయశంకర్



హైదర్‌గూడలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ బండ ప్రకాశ్‌ముదిరాజ్

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ముదిరాజ్

హిమాయత్‌నగర్, జూన్ 22: తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్‌ముదిరాజ్ అన్నారు. హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జయశంకర్ 13వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం బండ ప్రకాశ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం, భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్నే అర్పించిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలు నీళ్లు, నిధులు, నియామకాలపైన వాస్తవాలను తెలియజేసి ప్రజలను జాగృతం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గుర్రాల మల్లేశం, యూత్ అధ్యక్షుడు బాలు, ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య, కనకయ్య, బొక్క శ్రీనివాస్, నేతలు రామస్వామి, సత్యనారాయణ, అశోక్, మురళి, సాయిరాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో ముగిసిన బిగ్ డేటా అనలిటిక్స్ శిక్షణ

ముగింపు సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి తదితరులు

మణికొండ, జూన్ 22: మారుతున్న కాలానికి అనుగుణంగా ఫ్యాకల్టీలు నైపుణ్యాలను మెరుగుపర్చుకొని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని మహాత్మ గాంధీ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కళాశాల సీఎస్ఈ విభాగం నిర్వహించిన బిగ్ డేటా అనలిటిక్స్ శిక్షణ శనివారం ముగిసింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిగ్ డేటా అనలిటిక్స్‌పై శిక్షణతో భవిష్యత్తులో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. కార్యక్రమంలో స్పీకర్లు పి.రామ్‌మోహన్‌రావు, సీహెచ్ శివకృష్ణచారి, హెచ్ఓడీ డాక్టర్ సీఆర్‌కే రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించేలా చొరవతీసుకోవాలి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన శంషాబాద్ కాంట్రాక్టర్లు

శంషాబాద్ రూరల్, జూన్ 22: పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా చొరవతీసుకోవాలని శనివారం శంషాబాద్ మండలం, మున్సిపాలిటీ సివిల్ కాంట్రాక్టర్లు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గ్రామాల్లో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులకు గాను పెండింగ్‌లో ఉన్న బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.. రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రిని కలిసి పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చిన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎం.ప్రభుసాగర్, ఎస్.రాంరెడ్డి, జ్ఞానేశ్వర్‌యాదవ్, ఉస్మాన్, సంజీవ, విఠల్‌యాదవ్, రూఫ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

షెడ్లు కూల్చివేతపై యజమాని ఆందోళన

- పత్రాలను పరిశీలించకుండానే అధికారుల అత్యుత్సాహం
- మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ ఆరోపణ - పట్టాదార్ పాస్ పుస్తకం కూడా మంజూరైంది

గంధంగూడ భూమి పత్రాలను చూపుతున్న మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణ

బండ్లగూడ, జూన్ 22: తాను కొనుగోలు చేసిన భూమిలో ఏర్పాటు చేసిన షెడ్లను కూల్చివేయడంతో రెవెన్యూ అధికారులపై స్థల యజమాన్ని, మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. సరైన రీతిలో పత్రాలను పరిశీలించకుండా ఇస్టానుసారంగా వ్యవరించిన అధికారులపై కోర్టు ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. గండిపేట మండలం గంధంగూడలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిత్రకృష్ణ వివరాలను వెల్లడించారు. గంధంగూడలో సర్వే నంబర్ 51లోని 9 ఎకరాల 36 గుంటల భూమిని 2012లో తను ముస్లింలు, కౌలు దారులైన గ్రామస్తుల నుంచి కొనుగోలు చేశామన్నారు. అనంతరం మ్యూటేషన్ కావడంతో పాటు పట్టదార్ పాస్‌పుస్తకం కూడా మంజూరైనట్లు తెలిపారు. దీంతో ఆ స్థలంలో రేకుల షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. కాగా రెవెన్యూ అధికారులు స్థలానికి చెందిన రికార్డులను పరిశీలించకుండా ఉన్నతాధికారులను తప్పుదోవ పటించారని వాపోయారు. ముంతకాబ్‌లో కూడా సక్రమంగానే ఉన్నా అధికారులు అవేమి పట్టించుకోలేదని అన్నారు. తాము నిర్మించిన షెడ్లను కూల్చి వేశారని అవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై న్యాయం కోసం కోర్టును ఆశ్రయించగా స్టేటస్‌కో ఆర్డర్ వచ్చిందని తెలిపారు. తను డబ్బులు చెల్లించి భూమిని కొనుగోలు చేస్తే అధికారులు తనపై తప్పుడు ప్రచారం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు తప్పకుండా న్యాయం జరుగుతుందని అన్నారు.

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మహేందర్‌గౌడ్ దంపతులకు కార్పొరేటర్ పద్మవతి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. – బండ్లగూడ



కిస్మత్‌పూర్‌లో రోడ్ల నిర్మాణ పనులను చేపట్టండి

కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న కిస్మత్‌పూర్ గ్రామస్తులు

బండ్లగూడ, జూన్ 22: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తులు కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిస్మత్‌పూర్ గ్రామంలో రోడ్లన్ని గుంతలమయంగా మారి ఆస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలతో పాటు వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాలను చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగులకు రూ.45వేల వేతనమివ్వాలి

ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

హిమాయత్‌నగర్, జూన్ 22: నేషనల్ హెల్త్ మిషన్ స్కీం పరిధిలో పనిచేసే (ఎంఎల్‌హెచ్‌పీ) మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు కనీస వేతనం రూ.45వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఎంఎల్‌హెచ్‌పీ రాష్ట్రస్థాయి సమావేశం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపచేయకుండా ప్రభుత్వం వెట్టి చేయించుకుంటుందని ఆరోపించారు. సమస్యలను పరిష్కారం చేయాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తోట రామాంజనేయులు, సందీప్‌కుమార్, అస్పియా, చంద్రకళ, రమ్య, రాము, సంధ్య, షేక్ లతీఫ్, దీపిక, శ్రీకాంత్, జితేందర్, మురళి పాల్గొన్నారు.

మైనర్‌పై లైంగిక దాడి.. యువకుడు అరెస్ట్

నారాయణగూడలోని పీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శంకర్

హిమాయత్‌నగర్, జూన్ 22: మైనర్‌ను మభ్యపెట్టి లైంగిక దాడికి పాల్పడిన ఓ యువకుడిని నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చారు. నారాయణగూడ పీఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, ఎస్సై షపీతో కలిసి సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్ కేసు వివరాలను వెల్లడించారు. సైఫాబాద్‌కు చెందిన ఓ బాలిక (16) నారాయణగూడలోని ఓ కాలేజీలో చదువుతోంది. సైఫాబాద్‌లో ఉండే సయ్యద్ ఖలీల్(22) ఆటో డ్రైవర్. ఇన్‌స్టాగ్రామ్‌లో మైనర్‌తో ఖలీల్‌కు పరిచయం ఏర్పడింది. రెండేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈనెల 19న బాలిక కాలేజీకి వెళుతున్నానని ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. కాలేజీకి రాలేదనే విషయాన్ని యాజమాన్యం ఆమె తండ్రికి ఫోన్ ద్వారా తెలియజేసింది. అచూకీ కోసం తండ్రి వెతికినా సమాచారం లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నాంపల్లి రైల్వేస్టేషన్‌లో బాలిక ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లారు. గమనించిన ఖలీల్ బాలికను వదిలి పారిపోయాడు. బాలికను భరోసా సెంటర్‌కు తరలించి వాగ్మూలం రికార్డు చేయగా తనను ఓయో రూంలోకి తీసుకువెళ్లి ఖలీల్ లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. దీంతో పోలీసులు సయ్యద్ ఖలీల్ అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి ఒక యాక్టివా వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోక్సో చట్టం కింద అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై షపీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు చిన్నారుల అదృశ్యం

శ్రీశైలం వినయ్

బండ్లగూడ, జూన్ 22: ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి వివరాల ప్రకారం. చిన్నారులు శ్రీశైలం, వినయ్ శనివారం ఆడుకునేందుకు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. వారి చిన్నమ్మ రాధ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నాట్లు పోలీసులు తెలిపారు. చిన్నారులకు తల్లితండ్రులు చనిపోవడంతో పిన్ని రాధ వద్దే ఉండి చదువుకుంటున్నట్లు తెలిపారు.

నీ భార్యే.. నా ప్రియురాలు

- మాజీ ప్రియురాలి భర్తకు ఫోన్‌లో బెదిరింపు
- ఓయో రూమ్‌కు రాకుంటే ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తా..
- వివాహితను వేధించిన మాజీ ప్రియుడు
- మధురానగర్ పోలీసు స్టేషన్‌కు కేసు బదిలీ

వెంగళరావునగర్, జూన్ 22: రెండేళ్ల క్రితం తనను విడిచి పెట్టి మరొకరితో పెండ్లి చేసుకుందన్న విషయం తెలుసుకొని ప్రియుడు కోపంతో రగిలిపోయాడు. ఓయో రూమ్‌కు రావాలని.. లేకుంటే గతంలో సన్నిహితంగా ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని.. తనను దూరం పెడితే ఉరేసుకుని చస్తానని బెదిరింపులకు గురిచేశాడు. అంతటితో ఊరుకోకుండా ఆమె భర్తకు ఫోన్ చేసి నీ భార్య తన ప్రియురాలని చెప్పాడు. ప్రవర్తన బాగాలేని అమ్మాయిని పెళ్లెలా చేసుకున్నావంటూ బెదిరించాడు. నాడు మనసిచ్చిన ప్రియుడే తన జీవితాన్ని నాశనం చేస్తున్నాడంటూ బాధిత యువతి మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అక్కడి పోలీసులు కేసును మధురానగర్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశా రు. పోలీసుల కథనం ప్రకారం.. బోర బండకు చెందిన అర్బాజ్ ఖాన్(25)కార్మికనగర్‌కు చెందిన యువతి(21) 2017 నుంచి 2022 వరకు ఐదేండ్ల పాటు ప్రేమించుకున్నారు. గతంలో సన్నిహితంగా ఉన్న సమయంలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు. ప్రియుడితో వచ్చిన మనస్పర్ధలతో రెండేళ్ల నుంచి అతన్ని దూరం పెట్టింది. పెద్దలు కుదిర్చిన పెండ్లి చేసుకుంది. ఈ విషయం అర్బాజ్ ఖాన్‌కు తెల్సింది. దీంతో ఓయో రూమ్‌కు రావాలని.. లేకుంటే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో పాటు.. ఆమె బంధువులందరికీ పంపుతానని యువతిని బెదిరించాడు. కోరిక తీర్చకుంటే ఉరేసుకొని చస్తానని.. నా ఆత్మహత్యకు కారణం నువ్వేనంటూ, నీ పేరు, నీ అమ్మ పేరు రాస్తానని భయపెట్టాడు. యువతిని వెంబడిస్తూ వేధించేవాడు. భర్తకు ఫోన్లు చేసి నీ భార్య నా ప్రియురాలని.. ఆమె ప్రవర్తన బాగాలేదని చెప్పేవాడు. ఫోన్‌కు మెసేజ్‌లు పంపాడు. దీంతో బాధితురాలు మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేసును మధురానగర్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

మెల్కోటే పార్కులో మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్, జూన్ 22: ప్రజలకు ఆహ్లాదం పంచే పార్కులో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి తెలిపారు. శనివారం నారాయణగూడలోని మెల్కోటే పార్కులో నూతనంగా రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మరుగుదొడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మరుగుదొడ్లను సైతం నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత జి.రామన్‌గౌడ్, పార్కు అధ్యక్షుడు భూషణ్‌రావు, ప్రతినిధులు భరద్వాజ్, రాంరెడ్డి, జె.రవీందర్, వాస్ పాల్గొన్నారు.

గోదావరికి నిత్యహారతి

పుస్తకావిష్కరిస్తున్న గురుచరణ్ తదితరులు

ఖైరతాబాద్, జూన్ 22: వేద భారతీపీఠం ఆధ్వర్యంలో గోదావరి పరివాహక ప్రాంతంగా ఉన్న బాసర పుణ్యక్షేత్రంలో నిత్యహారతి క్రతువును నిర్వహిస్తున్నట్లు పీఠం ప్రతినిధి గురుచరణ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేద భారతి పీఠం ఆధ్వర్యంలో ప్రతిరోజు సాయంత్రం 6గంటలకు గోదావరిలో హారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. కుల, వర్ణ విభేదాలు లేకుండా ప్రతిఒక్కరికి వేదాలు నేర్పిస్తున్నామన్నారు. అనంతరం వేద విద్యానందగిరి స్వామి రచించిన ఇంటింటా వేదం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో మల్లేశ్‌రెడ్డి, సురేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి అధిక నిధులివ్వాలి

హిమాయత్‌నగర్, జూన్ 22: కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గీతకార్మికుల సంక్షేమం కోసం రానున్న శాసనసభ బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో శనివారం రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వన పెంపకం కోసం జీవో నంబర్ 560 ప్రకారం ఇచ్చే 5 ఎకరాలకు బదులు 10 ఎకరాలకు పెంచాలని అన్నారు. కల్లుగీత సహకార సంఘాలకు సైతం భూమిని కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కేవీఎల్, మారగోని ప్రవీణ్‌కుమార్, సైదులు, విఠల్‌గౌడ్, యాదయ్యగౌడ్, అంజయ్య, నాగేశ్వరరావు, రాంమూర్తి పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్స్ రాసేందుకు వన్‌టైమ్ ఛాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 22: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిన విద్యార్థులకు వన్‌టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థులకు ఈ అవకాశం కల్పించినట్లే పేర్కొన్నారు. అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 10లోగా , రూ. 300 అపరాధ రుసుముతో 12 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పరీక్షలను ఆగస్టులో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని, ఇతర వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.

ఎంఈ, ఎంటెక్ రీవాల్యుయేషన్ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లే పేర్కొన్నారు. ఫలితాలను www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షల ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) అన్ని సెమిస్టర్ల మెయిన్, బ్యాక్‌లాగ్, పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ మార్కుల మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవచ్చని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 29 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 29లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

ఖైరతాబాద్, జూన్ 22: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వారి సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ డాక్టర్ బి.విద్యుల్లత అన్నారు. సోమాజిగూడలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన ప్రొఫెసర్, డాక్టర్ రాధా రుక్మిణి, గద్వాల నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.కమలకు వీడ్కోలు సన్మాన సభ శనివారం కళాశాల ఆవరణలో జరిగింది. విద్యుల్లత మాట్లాడుతూ రాధా రుక్మిణి ఒకనర్సుగా తన జీవితాన్ని ప్రారంభించి ప్రిన్సిపాల్ స్థాయికి ఎదిగారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మిడ్ వైఫ్ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ బి.విద్యావతి, కళాశాల ప్రిన్సిపాల్ జి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు ఏమైనయ్

ఎర్రగడ్డ, జూన్ 22: ఎన్నికల హామీలను బుట్టదాఖలు చేసిన కాంగ్రెస్ సర్కారుకు పోరాటాలతో బుద్ధి చెబుతామని సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నేతలు హెచ్చరించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని యూసుఫ్‌గూడ సర్కిల్ డీసీకి శనివారం పార్టీ నేతలు అందజేశారు. అనంతరం బోరబండలో జరిగిన సమావేశంలో పార్టీ నాయకుడు సాయిశేషగిరిరావు మాట్లాడుతూ రేవంత్ సర్కార్ అన్ని అంశాలపై కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. పథకాలను ఆచరణలో పెట్టకుండా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించి గొప్పలు చెప్పుకొంటున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నయీం పటేల్, సికిందర్, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సికిందర్‌గూడ ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ ము న్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సికిందర్‌గూడలో ఉన్నప్రభుత్వ స్థలాన్ని రక్షించాలని స్థానిక కార్పొరేటర్ సాగర్‌గౌడ్ గండిపేట మండల తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ బండ్లగూడ, సికిందర్‌గూడ సర్వే నంబర్ 9,14,15,16 సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఆయ న విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

సకాలంలో బిల్లులు చెల్లించాలి

జూబ్లీహిల్స్, జూన్ 22: సకాలంలో నీటి బిల్లులు చెల్లించి సహకరించాలని జలమండలి జీఎం హరిశంకర్ కోరారు. శనివారం జూబ్లీహిల్స్ సెక్షన్‌లో పర్యటించి నీటి సమస్యలను పరిశీలించారు. బిల్లులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. మొండికేస్తే కనెక్షన్ తొలగించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

నూతన రోడ్ల అభివృద్ధికి చర్యలు

జూబ్లీహిల్స్: నూతన రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని సర్కిల్-19 ఈఈ రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం రాజీవ్‌నగర్‌లో అధికారులతో కలిసి రోడ్లు పరిశీలించారు. వర్షాలతో పాడైన రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు, కాలనీ ప్రతినిధి వినయ్‌సాగర్ పాల్గొన్నారు.

లోప్రెషర్ సమస్య పరిష్కరించాలి

జూబ్లీహిల్స్, జూన్ 22: రహ్మత్‌నగర్‌లో నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. లో ప్రెషర్ సమస్యలను పరిష్కరించాలని డివిజన్ పరిధిలోని వివిధ బస్తీల ప్రజలు శనివారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డిని కోరారు. ఈ మేరకు జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని ఈ సందర్భంగా